ప్రజాశక్తి

ఆదివారం 12 ఫిబ్రవరి 2023 | 5 | అనంతపురం





రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి



ద్విచక్రవాహన... ప్రమాదాలే అధికం..!

మృతుల్లో వాహనం నడుపుతున్న వారే ఎక్కువ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రమాదాలకు గురై మృతి చెందుతున్న వారిలో అత్యధికంగా ద్విచక్ర వాహనదారులే ఉన్నారు. ఆ తరువాత ట్రక్కు డ్రైవర్లు ఉంటున్నారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వం ఐఆర్‌ఎడి (ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్ డేటా బేస్)ను రూపొందించింది. దీని ప్రకారం ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకుంటే అటు రవాణా, ఇటు పోలీసు, జాతీయ రహదారి, వైద్య శాఖ అధికారులు అందరూ సంయుక్తంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన డేటా బేస్‌లోకి సమాచారాన్ని, తమ పరిశీలనను అందులో పొందుపరచాలని నిర్ధేశించింది. అది కూడా వాహనం యొక్క పూర్తి వివరాలతో ఈ డేటా బేస్‌ను రూపొందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈరకంగా అన్ని శాఖలు కలిపి రూపొందిస్తున్నాయి. దీని ప్రకారం జిల్లాలో చూస్తే ప్రమాదాల్లో అత్యధికంగా ద్విచక్ర వాహనాలే ఉంటుండటం గమనార్హం. మృతుల్లోనూ వీరే అధికంగా ఉంటున్నారు. జిల్లాలో వాహనాలు నడుపుతూ చనిపోయిన వారు 237 మంది ఉంటే అందులో ద్విచక్ర వాహనం నడుపుతూ 99 మంది చనిపోయారు. ఆ తరువాత ట్రక్కు, లారీ డ్రైవర్లు 57 మంది ఉన్నారు. జీపు డ్రైవర్లు 29 మంది చనిపోయారు. బస్సు డ్రైవర్లు 15 మంది ఆటో రిక్షా ఆరుగురు డ్రైవర్లు మృతి చెందిన వారిలోనున్నారు. ఈ వాహనాలు అన్నింటిలోనూ ప్రయాణిస్తున్న వారు 167 మంది చనిపోయారు. సహ ప్రయాణికులుగా ఉంటూ చనిపోయిన వారిలోనూ ద్విచక్ర, లారీల్లో ప్రయాణించే వారే ఉండటం గమనార్హం. ద్వికచక్రవాహనంలో డ్రైవింగ్ చేస్తున్న వారితోపాటు 46 మంది చనిపోయారు. ఇక లారీ, ట్రక్కుల్లో చూస్తే 34 మంది ఉన్నారు. కారు ప్రమాదాలుపై వాటితో పోలిస్తే తక్కువగానే ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

డ్రైవింగ్ లైసెన్సు లేని వారే ఎక్కువ...

రోడ్డు రవాణా శాఖ గతేడాది జనవరి ఒకటి నుంచి డిసెంబర్ ఆఖరు వరకు చూస్తే మొత్తం 9234 మంది నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిలోనున్నారు. ఇందులో చూసినప్పుడు అత్యధికంగా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపిన వారే అధికంగా ఉండటం గమనార్హం. 3921 మంది లైసెన్సు లేకుండా వాహనం నడుపుతున్న వారిని గుర్తించి జరిమానాలు విధించారు. ఆ తరువాత అత్యధిక వేగంగా నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు. 2404 మంది అత్యధిక వేగంగా నడుపుతున్న వారిని గుర్తించి జరిమానాలు విధించారు. 1384 కేసులు ఓవర్ లోడింగ్‌తో వెలుతున్న వాటికి జరిమానాలు విధించారు.

రోజుకు సగటున ఒకరు మృతి

జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను చూసినప్పుడు రోజుకు ఒకరు చొప్పున సగటున మృత్యువాత పడుతున్నారు. 2022 సంవత్సరంలో చూసినప్పుడు 321 మంది మృతి చెందారు. దాదాపు ఒకరు చొప్పున మృతి చెందుతన్నారు. ఈ మృతుల్లో ద్విచక్ర వాహనదారులే అధికంగా ఉన్నట్టు ఐఆర్‌ఎడి నివేదికలు చెబుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గడిచిన రెండు రోజులుగానూ వరుసగా ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. కనగానపల్లి వద్ద జరిగిన కారు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. అమరాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి చెందారు. ఇలా రోజూ ఏదోక చోట రోడ్డు ప్రమదాల్లో ప్రాణాళు కోల్పోతూనే ఉన్నారు.



అమరాపురం యంజేరు చెరువు వద్ద ప్రమాదంలో మృతి చెందిన యువకులు

టిప్పర్-ద్విచక్రవాహనం ఢీ ఇద్దరు మృతి

అమరాపురం : టిప్పర్, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా అమరాపురం మండలం హేమావతి యంజేరు చెరువు మలుపు వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అమరాపురం మండలం హనుమంతనపల్లి గ్రామానికి చెందిన ఈరన్న కుమారుడు అనిల్ కుమార్(25), కర్ణాటక రాష్ట్రం హులికుంట గ్రామానికి చెందిన శ్రీధర్(24)లు హులికుంట నుంచి ద్విచక్రవామనంలో హనుమంతనపల్లికి బయలుదేరారు. ద్విచక్ర వాహనం హేమావతి యంజేరు చెరువు మలుపు వద్దకు రాగానే పావగడ నుంచి కర్నాటక రాష్ట్రం దొడ్డబానగెరెకు వెళ్తున్న టిప్పర్ ఢీకొంది. టిప్పర్ చక్రాలు యువకుల మీద వెళ్లడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద వివరాలను స్థానికులతో అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'ఉపాధి' నిర్వీర్యానికి బిజెపి కుట్ర

బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దుర్మార్గం

కేంద్రం తీరుపై ప్రజాసంఘాల నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కూలీలకు ఎంతో ఆసరాగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేలా కేంద్రంలోని బిజెపి విధానాలు ఉంటున్నాయని పలువురు ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో ఉపాధికి నిధులు కేటాయింపులో కేంద్రం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం నాడు నగరంలోని జెవివి కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వ్యకాసం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్.కాసింపీరా, మాజీ వ్యకాసం నాయకులు కెవి.రమణ, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, ఐద్వా రాష్ట్ర నాయకురాలు సావిత్రి, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో అతి తక్కువ నిధులు కేటాయించిందన్నారు. గడిచిన ఐదేళ్లలో బడ్జెట్‌లో అతి తక్కువ నిధులు కేటాయించడం ఈ ఏడాదే అన్నారు. చట్టబద్ధంగా 100 రోజుల పాటు పని కల్పించాలంటే, వచ్చే ఆర్థిక సంవత్సరం కనీసం రూ.2.72 లక్షల కోట్ల నిధులు అవసరం అవుతాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలే దాదాపుగా రూ.25 వేల కోట్ల వరకు ఉంటాయని అంచనా ఉందన్నారు. ఇది పోను వచ్చే సంవత్సరానికి నికరంగా అందుబాటులో ఉండే నిధులు కేవలం రూ.35 వేల కోట్లు మాత్రమే అన్నారు. ఇవి మొదటి మూడు నెలల మాసానికే సరిపోతాయని చెప్పారు. అవసరమైన నిధుల్లో 22 శాతం మాత్రమే కేంద్రం కేటాయించడం చూస్తుంటే బిజెపి ఉపాధి చట్టాన్ని నీరుగార్చేందుకు కుట్ర చేస్తున్నట్లు స్పష్టంగా అర్థం అవుతోందన్నారు. ఉపాధి పనులు ప్రతి సంవత్సరం పెంచాల్సింది పోయి, దానికి కేటాయింపులు తగ్గించి చట్టాన్నే నీరుగార్చేలా చేయడం సరికాదన్నారు. బిజెపి ప్రభుత్వం కూలీల కడుపుగొట్టేలా చేస్తున్న ఈ నిర్ణయంపై ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలన్నారు. ఉపాధికి పూరి స్థాయిలో నిధులు కేటాయించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, జయరాముడు, ఈశ్వరయ్య, రంగా, లక్ష్మీదేవి, నారాయణరెడ్డి, కృష్ణ, నారాయణ, కొండన్న, నాగప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారిగా ఎం.సాయిరాం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనంతపురం జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా సాయిరాంను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జవహార్ బాల భవన్ డైరెక్టర్ అండ్ స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను అనంతపురం డీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ ఉత్తర్వుల్లో జారీ చేశారు. అనంతపురం డిఇఒగా ఆయన రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటం

నరేష్ ఆశయాలను కొనసాగిస్తాం - ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటాలు సాగిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతుర్ పరమేష్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు నరేష్ వర్ధంతిని పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు నరేష్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ విద్య పరిరక్షణకు, సంక్షేమ హాస్టళ్లలో సమస్యల పరిష్కారం కోసం నరేష్ అనేక పోరాటాలు చేశారన్నారు. ముఖ్యంగా కార్పొరేట్ విద్య దోపిడీకి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తామన్నారు. ఇకపోతే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో విద్యను ప్రయివేటీకరణ, కాషాయకరణ చేసేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇటీవల తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానమే ఇందుకు నిదర్శమన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ కూడా విద్య పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టల్లో అనేక సమస్యలు ఉన్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. చాలా హాస్టళ్లలో కనీసం నీరు కూడా ఉండటం లేదన్నారు. మరుగుదొడ్లు లేవని, నాణ్యమైన భోజనం లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని ప్రవేశపెట్టి విద్యార్థులను మానసికంగా ఇబ్బందులు గురిచేస్తుందన్నారు. వెంటనే ఎఫ్ఆర్ఎస్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా యూనివర్శిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వాలు స్పందించి వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, కిరణ్, అనిల్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



నరేష్ చిత్రపటానికి పూలామాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం నివాళి

సిపిఎం 1వ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు నరేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ నరేష్ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘంలో పని చేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమన్నారు. నరేష్ విద్యార్థి సంఘంలో అనేక ఉద్యమాలు చేపట్టినట్లు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వెంకటనారాయణ, వలీ, ప్రకాష్. విద్యార్థి సంఘం నాయకులు పరమేష్, విజయ్, మహేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



నరేష్ చిత్రపటానికి పూలామాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతుర్ పరమేష్, నాయకులు

సచివాలయాలతో.. ప్రజలచెంతకు ప్రభుత్వ పథకాలు

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే సిఎం జగన్ గృహ సారథులు, సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. శనివారం కూడేరు మండలం శివరావ్ ఫంక్షన్ హాల్లో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సిఎం జగన్ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను ఎంపిక చేశారన్నారు. కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల అవసరాలను తెలుసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వైసిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చేనేతపై జీఎస్టీతో కార్మికులకు నష్టం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

చేనేత వస్తువులపై జీఎస్టీని ఎత్తివేయాలని చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల మోహనరావు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో ఉన్న చౌడేశ్వరి ఆలయంలో చేనేతల సమైక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల కోసం 1985లో చేసిన 22 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాలను ప్రస్తుత ప్రభుత్వాలు అమలు చేయకపోవడం వల్ల అనేకమంది కార్మికులు కూలీలుగా, దుస్తులు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఇప్పటికే సంక్షోభంలో కూరుకుపోయిన చేనేత పరిశ్రమపై మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు జీఎస్టీ విధించడం బాధాకరమన్నారు. వెంటనే చేనేత వస్తువులపై జీఎస్టీని తగించి చేనేత పరిశ్రమకు ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు చింతా పురుషోత్తం, నాయకులు చందా చితాంబరి, గుంటూరు మల్లికార్జున రావు, వీర నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయంచేయాలని యువతి నిరసన

ప్రజాశక్తి-గుత్తి

ఆరేళ్ల పాటు ప్రేమించి పెళ్లికి చేసుకోకుండా మోసం చేసిన యువకుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం గుత్తిలో ఓ యువతి, కుటుంబ సభ్యులు, బంధువులు, నిరసన తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక గాంధీ కూడలి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడ బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యువతి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లికి చెందిన సంధ్యాకుమారి, ఆర్ఎస్ చెందిన యశ్వంత్‌బాబు ఆరేళ్లుగా ప్రేమించుకున్నారన్నారు. దీంతో యశ్వంత్‌బాబుకు సంధ్యాకుమారి ఆర్థికంగా కూడా ఆదుకుందన్నారు. అయితే ఇప్పుడు వివాహం చేసుకోమని అడిగితే చేసుకోనని మోసం చేశాడని ఆరోపించారు. కావున పోలీసులు స్పందించి సంధ్యాకుమారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. యువతికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ఆందోళన చేస్తున్న యువతి, బంధువులు

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి

వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మండలంలోని కిష్టిపాడు గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం ఒక వరం అన్నారు. కూలీలు వలసలు పోకుండా ఉన్న గ్రామాల్లోనే పనులు కల్పించే పథకం అన్నారు. అలాంటి పథకాన్ని ఎత్తివేయాలన్న దురుద్దేశంలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులను కోత విధిస్తోందని ఆరోపించారు. అంతేగాకుండా పనుల కల్పనలో అనేక మార్పులను తీసుకొచ్చిందన్నారు. అలాగే నెలలు తరబడి బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కృష్ణనారాయణ, శివకృష్ణ, మేటి సత్యనారాయణాచారి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



కూలీల సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి-గుత్తి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీ చేస్తున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిను గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. శనివారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. అనంతరం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు పేదల పక్షాన ఉంటూ నిత్యం ప్రజల కోసం పోరాడుతూ ఉద్యోగాన్ని సైతం వదులుకున్నారని గుర్తు చేశారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మద్దిలేటి, కార్యదర్శి ఎస్.మున్నీ డివైఎఫ్ఐ నాయకులు బి.ఓబులేసు, వంశీ, కేశవ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలు విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కరువు నేలలో కార్పొరేట్లకు కాసుల పంట

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశంలోనే అత్యల్ప వర్షపాత కలిగిన ప్రాంతంగా అనంతపురం ఉంది. జైసల్మీర్ తరువాత అతి తక్కువ వర్షపాతం కలిగి, నిత్యం క్షామపీడిత ప్రాంతంగా ఉండటంతో ఇక్కడి రైతులు వర్షాల కోసం ఎప్పుడూ ఆకాశం వైపు ఎదురు చూస్తూ ఉంటారు. ఎప్పుడూ ఎండలు ఉండి, మబ్బులే కనిపించక రైతులు అష్టకష్టాలు పడుతుంటారు. ఇప్పుడూ ఇదే కార్పొరేట్లకు కాసులు కురిపించనున్నాయి. మారిన పరిస్థితుల నేపథ్యంలో గ్రీన్ ఎనర్జీ అంటే ప్రకృతి వనరుల ఆధారగా విద్యుత్ ఉత్పత్తి చేపట్టే ఆలోచన అంతర్జాతీయంగా పెరుగుతోంది. ఇందుకు కోసం పెద్దపెద్ద కంపెనీలకు ఆయా ప్రభుత్వాలు పెద్దఎత్తున ప్రోత్సహకాలు అందజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కార్పొరేట్లు ఇప్పుడు విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి పెద్దఎత్తున ప్రవేశిస్తున్నాయి. సువిశాల భూభాగం కలిగిన కావాల్సినంత ఎండ, గాలి ఉండటంతో గాలి, పవన విద్యుత్ ఉత్పత్తికి ఉమ్మడి అనంతపురం జిల్లా అత్యంత అనువైన ప్రాంతంగా ఉంది. ఇప్పటికే 4811 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు జరిగింది. మరిన్ని కేంద్రల ఏర్పాటుకు కసరత్తు నడుస్తోంది. ఈ మేరకు జిల్లాలో పెద్దఎత్తున భూములను ఆ సంస్థలకు కట్టబెట్టే ఆలోచనను ప్రభుత్వం చేస్తోంది. ఇది వరకే రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో 11 వేల ఎకరాలకు వరకు మొదటి విడతలో ఇవ్వడానికి రంగం సిద్ధమైంది. ఇది



వరకు గ్రామసభలు సైతం నిర్వహించారు. ఇది చాలదన్నట్టు తాజాగా ఈ వారంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అదే సంస్థకు మరో 406 ఎకరాల భూమిని పంప్డ పవర్ ఉత్పత్తి పేరుతో కేటాయించారు. ఇంకా వేలాది ఎకరాలకు ఇవ్వడానికి అనువుగానున్నట్టు ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు చూపుతోంది. ఈ రకంగా జిల్లాలో లక్షల ఎకరాల భూములను కంపెనీలకివ్వడానికి సుముఖత వ్యక్తం చేసింది. విద్యుత్ డిమాండ్ కూడా ఉండటంతో కంపెనీలు ముందుకొస్తున్నాయి. అయితే వీటిని ఏర్పాటు చేసి కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నాయి. అయితే తీసుకున్న భూములకు ఎటువంటి పరిహారం చెల్లించని సంస్థలు, రైతులకు లీజు పేరుతో ఏడాదికి రూ.30 వేలు ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ అంశాన్ని ఇప్పుడు సిపిఎం లేవనెత్తింది. రైతులకు ఏడాదికి కాకుండా నెలకు రూ.30 వేలు ఎకరానికి లీజు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. ఈ అంశంపైనే గత వారంలో ఎన్జీవో హోంలో జరిగిన సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ కూడా దీనిపై పోరాటం చేస్తామని చెబుతోంది. రైతుల్లో అవగాహన కల్పించి సమీకరించి పోరాటం సాగిస్తామంటోంది. ఇదే సమయంలో కేంద్రప్రభుత్వం తొలి వారంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పైనా విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పర్ భద్రకు కేంద్రం నిధులు కేటాయించడంపై జిల్లాలో నేతలు మండిపడుతున్నారు. అన్ని రాజకీయ పక్షాలు దీనిపై స్పందించాయి. అడ్డుకుంటామని చెబుతున్నాయి. అయితే ఇంత వరకు ఏ సంఘం కూడా దీనిపై కార్యచరణ ఏదీ ప్రకటించలేదు. అప్పర్ భద్ర నిర్మాణం పూర్తవుతే అనంతపురం జిల్లాకు తీరని నష్టం జరుగుతుందన్న ఆందోళన మాత్రం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు అంశాలు జిల్లాలో గత వారం ప్రధాన హాట్ టాపిక్‌గానూ మారాయి. అటు రాజకీయంగానూ ఇవి చర్చనీయాంశమూ అయ్యాయి.


విద్యార్థులతో మాట్లాడుతున్న సిటిజన్ ఫోరం కన్వీనర్ ఎ.రసూల్

విద్యార్థులకు క్విజ్‌పోటీలు

అనంతపురం : విద్యాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగంపై శనివారం నగరంలోని కెఎస్ఆర్ పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిటిజన్ ఫోరం కన్వీనర్ ఎ.రసూల్ ప్రారంభించారు. విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రతినెలా 2వ శనివారం వ్యాసరచన, డ్రాయింగ్ వకృత్వ పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రాజమోహన్, కో కన్వీనర్ రాజు, రామకృష్ణ, సురేంద్ర, బాలకృష్ణ, పాల్గొన్నారు.

మహాప్రస్థానం చదువుదాం రండి..!

అనంతపురం : 'రెడ్ బుక్స్ డే'గా అంతర్జాతీయ లెఫ్ట్ పబ్లిషర్స్ యూనియన్ (ఐయుఎల్‌పి) నిర్వహిస్తుంచనున్న మహాప్రస్థానం చదువుదాం రండి.. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సాహితీస్రవంతి అధ్యక్ష, కార్యదర్శులు ప్రగతి, హిదాయతుల్లా శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగాధిపతి హేమమాలిని అధ్యక్షతన ఈనెల 12న ఆదివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో యువతను విప్లవ స్ఫూర్తిని నించేందుకు మహాప్రస్థానం కవితా పఠనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. కావున సమాజ పురోభివృద్ధిని కాంక్షించే ప్రజలు, సాహిత్యాభిమానులు, రచయితలు, కళాకారులు, మేధావులు మహాప్రస్థానం కవితా పఠనంలో పాల్గొనాలని కోరారు.

లక్ష్మీనారసింహుడికి పల్లకీసేవ

ఉరవకొండ : మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి పల్లకిసేవ ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి పల్లకీలో మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారకానాథ్‌స్వామి, బాలాజీ స్వామి, సిబ్బంది దీపక్, నరసింహులు, నాగేంద్ర, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన రథ నిర్మాణానికి భక్తుల సహకారం

లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం నూతన రథ నిర్మాణానికి భక్తుల నుంచి పెద్దసంఖ్యలో విరాళాలు వస్తున్నట్లు ఆలయ ఈవో విజయ్‌కుమార్ తెలిపారు. ఇప్పటివరకు భక్తుల నుంచి నూతన రథం నిర్మాణానికి రూ.78,04,672 అందినట్లు తెలిపారు.


స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

In the Court of the Prl. Senior Civil Judge:Anantapuramu
O.S.No.50/2022

Between:
Y.Parvathi ...Plaintiff
And
A.Renuka Devi (Died) by L.Rs, K.Manasa ...Defendant

Notice to Defendant

To
K.Manasa W/o Dileep D/o A.Renuka Devi, Resident of D.No.102, Upstairs, D.No.1-1058-B, Rudrampedta By Pass, Alamur Road, Anantapuramu.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 16-02-2023వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆరోజు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసును మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

N.R.K. Mohan, Advocate
Anantapur.

In the Court of the Prl. District Judge:Anantapuramu
I.A.No.1597/2022 I.A.No.1598/2022
I.A. No.1599/2022 in A.S.No.82/2018

Between:
Dabbidi Pedda Siddappa ...Petitioner/Appellant
And
Dabbidi Honnuramma and others ...Respondants/...Respondants/Proposed Party

Notice to Respondant No.15,16 and 17

R15: Smt. K.Lakshmi W/o Sreenivasulu Madhava Swamy Nilayam, L.R. Peta By the side of house of T.G. Venkatesulu, Kurnool.
R16: D.Mahesh S/o D.Chandra Sekhar, D.No.131-72, Post Office Road, Dabbidi Street, Rayadurgam.
R17: D.Chinna Lakshmi W/o D.Chandra Sekhar, D.No.131-72, Post Office Road, Dabbidi Street, Rayadurgam.

పై నెంబరు కేసులో రెస్పాండెంట్లు అయిన మీ హాజరు నిమిత్తం తేది:17-02-2023వ తేది ఉ॥10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఎన్.ఆర్.కె. మోహన్, అడ్వకేటు
అనంతపురం.

లోక్‌అదాలత్‌లో 313 కేసులు పరిష్కారం

రాయదుర్గం : రాయదుర్గంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 313 కేసులు పరిష్కరించారు. మండల న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు జడ్జి లావణ్య ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించగా 42 భారత శిక్షాస్మృతి కేసులు, 261 ఎస్‌టిసి కేసులు, 10 ఇతర కేసులు వచ్చినట్లు తెలిపారు.

గుత్తి : న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో 725 కేసులు పరిష్కారమయ్యాయి. మండల న్యాయ సేవా సమితి అధ్యక్షులు, జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి జి.కబర్ది, జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.విజయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా లోక్ అదాలత్‌లో 13 ఎంవిఏపి కేసులకు సంబంధించి రూ.కోటి పరిహారం అందించినట్లు తెలిపారు. 108 ఐపీసీలు సంబంధించి రూ.1,05,056 జరిమానా, 575 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు సంబంధించి రూ.2,11,670, వాల్టాయాక్ట్‌కు సంబంధించిన కేసులకు రూ.1,05,000 జరిమానా రూపంలో వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మనోహర్‌బాబు, వి.రవీంద్రబాబు, వి.సోమశేఖర్, పి.సుదర్శన్‌రావు, కె.శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


గుత్తిలో కేసులను పరిశీలిస్తున్న జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి జి.కబర్ది, జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విజయ్‌కుమార్‌రెడ్డి

గురుకుల పాఠశాలలో శుభ్రత పాటించాలి

ఎస్సీ, ఎస్టీ ప్రజాసమాఖ్య పార్లమెంట్ అధ్యక్షుడు బి.రమేష్

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని ఎస్సీ, ఎస్టీ ప్రజా సమాఖ్య పార్లమెంట్ అధ్యక్షులు బి.రమేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాల ముందు భాగంలోనే డ్రెయినేజీ కాలువ మురుగునీరు, చెత్తాచెదారంతో నిండిపోయిందన్నారు. దీంతో దోమలకు నిలయంగా మారిందన్నారు. ఫలితంగా విద్యార్థినులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. అదేవిధంగా పాఠశాలలోకి కోతులు, కుక్కలు వస్తుండటంతో విద్యార్థినులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఉదయం నుంచి కరెంట్ లేకపోవడంతో తాగునీటి కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. చేసేదిలేక బయట నుంచి ఆటో ద్వారా నీటిని తెప్పించి దాహం తీర్చుకుంటున్నట్లు తెలిపారు. కావున ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


గురుకుల పాఠశాల సిబ్బందిని సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ ప్రజాసంఘాల సమాఖ్య నాయకులు బి.రమేష్

సాగు రైతులకు పట్టాలివ్వాలి : వ్యకాసం

ప్రజాశక్తి - చిలమత్తూరు

సాగులో ఉన్న రైతులకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీ ఓబులాపురం గ్రామం లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దేమకేతేపల్లి పొలం సర్వేనెంబర్ 377,67 లలో జెండా ఆవిష్కరణను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా సాగులో ఉన్న రైతులకు హక్కు కలిస్తూ పట్టాలని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, లక్ష్మి నారాయణ, మాబు, నంజుండ, శ్రీనివాసులు, నిడిమామిడప్ప తదితరులు పాల్గొన్నారు.

రాజీతోనే ప్రశాంత జీవనం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

రాజీతో ప్రశాంత జీవనం సాగించాలని సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి మాట్లాడుతూ గ్రామాల్లో అనేక మంది క్షణి కావేశానికి లోనై కేసుల్లో ఇరుక్కుని కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామాలలో అందరూ ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. కేసుల్లో ఇరుక్కుని జైలుపాలైతే కుటుంబ సభ్యుల పరిస్థితులు ఎలా ఉంటాయో ఒక్కసారి ఆలోచించాలన్నారు. అనంతరం పలుకేసులను రాజీ ద్వారా పరిష్కరించారు. మొత్తం 330 కేసులను పరిష్కరించినట్లు జడ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోషియేషన్ సీనియర్ న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్


ప్రభుత్వాస్పత్రులలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిఎం హెచ్ఒ కృష్ణారెడ్డి సూచించారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలోని మెడికల్ ఆఫీసర్లు, ఎఎన్ఎంలు, సూపర్వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్నారు. హై రిస్క్ గర్భిణుల కేసులను జిల్లా ప్రభుత్వాస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు. రోగ నిర్ధారణ బట్టి వైద్యచికిత్సలు అందించాలన్నారు.కాలాగుణంగా వచ్చే వ్యాధులపై ముందుగానే ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రణాళికలను ఏర్పాటుచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సెల్విసాల్మాన్, ప్రభుత్వ వైద్యాధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్ కష్ణారెడ్డి

రాష్ట్రస్థాయిలో బొమ్మనహాల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎల్.విద్య, 8వ తరగతి చదువుతున్న ఫణి జిల్లా సైన్స్ విజ్ఞాన ప్రదర్శనల్లో జిల్లాస్థాయిలో ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈమేరకు విద్యార్థులను అభినందించారు.


జిల్లాస్థాయిలో ప్రశంస పత్రం అందుకుంటున్న బొమ్మనహాల్ విద్యార్థి

బెలుగుప్ప : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థిని పి.వేద చందన గణిత శాస్త్రంలో చేసిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎస్ఓ మంజుల తెలిపారు. ఈమేరకు శనివారం స్థానిక పాఠశాలలో విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మల్లారెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విందుకు హాజరైన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని చిన్న జలాలపురం గ్రామంలో మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప మనవరాలు భవ్య కేశఖండన కార్యక్రమానికి టిడిపి అనంతపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి, తదితరులు హాజరయ్యారు. ఇందులో భాగంగా చిన్నారిని ఆశీర్వదించి విందులో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకుల ఆంజినేయులు, ఆకుల విజయ్‌కుమార్ (బాబు) దాసరి గంగాధర్, శ్రీనివాసులుగౌడ్, అనిల్, ఎం.ఆదినారాయణ, బెస్త నారాయణస్వామి, బిసి సెల్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.


విందులో పాల్గొన్న టిడిపి నాయకులు

కాలనీవాసుల దాహం తీర్చిన సర్పంచి అంజినమ్మ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల పరిధిలోని ఎరడికెర గ్రామం బీసీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను సర్పంచి అంజనమ్మ శనివారం పరిష్కరించారు. రెండు నెలలుగా నీటి ఎద్దడితో బాధపడుతున్నట్లు ఎరడికెర బీసీ కాలనీవాసులు సర్పంచి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సర్పంచి యుద్ధ ప్రాతిపదికన కాలనీలో బోరు తవ్వించి పైప్‌లైన్ బిగించారు. దీంతో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ నజీర్‌బాషా, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు గాజుల ఎర్రిస్వామి, ఉప సర్పంచి తిప్పేస్వామి, వార్డు మెంబర్ తిప్పేస్వామి, కాలవ వాసు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



బోరు తవ్విస్తున్న సర్పంచి భర్త యల్లప్ప

శనగ పంట కోసుకెళ్లారని ఫిర్యాదు

పుట్లూరు : తన పొలంలో పండిన శనగ పంటను కోసుకెళ్లారని పోలీస్‌స్టేషన్‌లో రైతు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మడ్డిపల్లికి గ్రామానికి చెందిన నారపరెడ్డి తన పొలంలో సాగు చేసిన శనగ పంట కోతకు వచ్చిన దశలో గోవర్ధన్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి కలిసి తనకు తెలియకుండా కోసుకెళ్లారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

ఉరవకొండ : జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాలు మేరకు నియోజకవర్గంలో శనివారం క్రియాశీలక సభ్యత్వ నమోదును జిల్లా కార్యదర్శి గౌతమ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రియాశీలక సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి కార్యకర్తకీ భరోసా కల్పించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షల బీమా, గాయపడితే రూ.50 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వజ్రకరూరు అధ్యక్షులు కేశవ్, విడపనకల్ మండల అధ్యక్షులు గోపాల్, బెలుగుప్ప, మండలాధ్యక్షులు సుధీర్, జనసేన నాయకులు రాజేష్, హరీష్ శంకర్‌నాయక్, తిలక్, సురేష్, గోపీ, నారాయణ, తిప్పయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభ్యత్వం చూపుతున్న జనసేన పార్టీ నాయకులు

నేరాలు ఘోరాలు

కందికోత యంత్రం తగిలి వ్యక్తి మృతి

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని రాతిబావి వంక గ్రామానికి చెందిన వన్నప్పశెట్టి (70) కందుల కోత యంత్రం తగిలి మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. వన్నప్ప తన వ్యవసాయ పొలంలో శనివారం కందులు యంత్రంతో పంటను కోశారు. ఇందులో భాగంగా యంత్రం వెనకవైపు కందులు పడుతున్నాయని గమనించిన వన్నప్ప చెయ్యి అడ్డుగా పెడుతుండగా యంత్రం లాక్కుంది. దీంతో తీవ్రంగా గాయపడిన బాధితుడిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బ్రాహ్మణపల్లిలో బాలికపై అత్యాచారయత్నం

బెలుగుప్ప : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మూడవ తరగతి చదువుతున్న చిన్నారిపై డిగ్రీ చదువుతున్న ఓ యువకుడు శుక్రవారం అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. పాఠశాల సమయంలో ముగ్గురు చిన్నారులకు చాక్లెట్లు ఇప్పిస్తానని నమ్మబలికి ఇంట్లోకి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇద్దరు చిన్నారులు బయట ఉండగా మూడో తరగతి చదువుతున్న చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. అయితే బాలిక గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చారు. గమణించిన యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాలికకు రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం కళ్యాణదుర్గం తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన యువకుడిని కఠినంగా శిక్షించాలని బ్రాహ్మణపల్లి గ్రామస్తులు డిమాండ్‌చేశారు. యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాగా తల్లిదండ్రులు చిన్నారిని అమ్మమ్మ వద్ద వదిలి ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు.

అరటి, సీతాఫలం తోట దగ్ధం

రూ.10 లక్షల ఆస్తి నష్టం

పుట్లూరు : ప్రమాదవశాత్తు అరటి, సీతాఫలం తోటలు దగ్ధమైన ఘటన శనివారం మండల పరిధిలోని సి.వెంకన్నపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వెంగలపల్లి గ్రామానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి తనకున్న పదెకరాల పొలంలో అరటి, సీతాఫలంతో పాటు టెంకాయ చెట్లు సాగు చేశాడు. ఈనేపథ్యంలో శనివారం ప్రమాదవశాత్తు చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో అరటి, సీతాఫలం పంటలు పూర్తిగా కాలిపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. అంతేగాకుండా డ్రిప్పు, కేబుల్ వైర్లు స్టార్టర్ కాలిపోయినట్లు ఆందోళన వ్యక్తం చేశాడు,. ఈ ఘటనలో సుమారు రూ.10లక్షలు ఆస్తినష్టం వాటిల్లినట్లు వాపోయాడు. ప్రభుత్వం స్పందించి ఆర్థికసాయం అందించాలని రైతు కోరాడు.



కాలిన బూడిదైన పంట, మోటారు

మామిడి, జామచెట్లకు నిప్పు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

మామిడి, జామ, నిమ్మకాయ, అల్లునేరడి చెట్లకు శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పుపెట్టిన సంఘటన మండలంలోని రేగాటిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. తనకున్న ఐదెకరాలలో 2017లో వంద మామిడి చెట్లు, 350 జామ చెట్లు, 20 నిమ్మచెట్లు, 20 అల్లునేరడి చెట్లు సాగు చేసినట్లు రేగాటిపల్లి గ్రామానికి చెందిన దళిత రైతు వరదరాజులు తెలిపారు. కంటికి రెప్పలా కాపాడుకున్న పంటను గుర్తుతెలియని దుండగులు శుక్రవారం నిప్పుపెట్టడంతో చెట్లన్నీ కాలిపోయాయని రైతు వాపోయారు. సమీప పొలంవారు సమాచారం ఇవ్వడంతో వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా మంటలను ఆర్పివేశారన్నారు. దీంతో తనకు రూ.5లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు ధర్మవరంరూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యల్లారెడ్డి గారి తిమ్మారెడ్డికి నివాళి

ఉరవకొండ : స్వర్గీయ రాకెట్ల నారాయణరెడ్డి పెద్ద కుమారుడు, జర్నలిస్ట్ యల్లారెడ్డి గారి తిమ్మారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి నివాసంలో తిమ్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వేశ్వరరెడ్డి, ఆయన కుమారుడు వై.ప్రణయ్‌రెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, మునిరత్నం, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


తిమ్మారెడ్డికి నివాళులర్పిస్తున్న దృశ్యం


అమ్మలదిన్నెలో పంటకోత ప్రయోగం

పెద్దపప్పూరు : మండలంలోని అమ్మలదిన్నె గ్రామంలో రైతు నారాయణస్వామికి చెందిన సర్వే నెంబర్ 534లో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ పరిశీలించారు. ఇందులో భాగంగా పంటకోత ప్రయోగంపై సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.ఆంజనేయులు, ఎఇఒ గంగులయ్య, రైతులు పాల్గొన్నారు.


పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్

శ్మశాన వాటికలో కంపచెట్ల తొలగింపు

ఉరవకొండ : విడపనకల్లు మండలం గడేకల్ గ్రామంలో ఉన్న శ్మశాన వాటికలో జెసిబి ద్వారా పేరుకుపోయిన కంపచెట్లను తొలగించారు. ఈ సందర్భంగా ఎంపిపి కరణం పుష్పావతి, సర్పంచి సుశీల మాట్లాడుతూ వైసిపి పెద్దల సహకారంతో జెసిబిలు ఏర్పాటు చేసి ఐదెకరాల్లో కంపచెట్లను తొలగించినట్లు తెలిపారు. త్వరలోనే శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, మేకల పంపాపతి, ఎంపిటిసి ఓబులేష్, అంపయ్య, ఉమాశంకర్, మాల్యం తిక్కన్న, ప్రసాద్, నాగరాజ్, లాలెప్ప, మనోహర్, మహేష్, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.


కంపచెట్లను తొలగిస్తున్న జెసిబి